



'ఎసెన్షియా' కంపెనీ వద్ద బుధవారం అర్ధరాత్రి అధికారులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

విరుచుకుపడిన మృత్యువు



'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వద్ద గుమిగూడిన జనం



'ఎసెన్షియా' ఫార్మాలో పేలుడు

18 మంది మృతి, 30 మందికి తీవ్ర గాయాలు

మృత్యువు కరాళ నృత్యం చేసింది. భారీ శబ్దంతో కార్మికులపై విరుచుకుపడింది. పనిగంటలు ముగిసి, ఇంటికి వెళ్లేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో పేలిన రియాక్టర్ కొందరి శరీరాలను తునాతునకలు చేసింది. రసాయనాలతో కూడిన పొగ కమ్మేసి కొంతమంది ఊపిరి తీసేసింది. ఘటనలో మొత్తంగా 18 మందిని తిరిగిరాని లోకాలకు తీసుకుపోయింది. మరెంతో మందిని తీవ్రంగా గాయపరిచింది. బాధితుల హాహాకారాలు, ఆర్తనాదాలతో పరిశ్రమ ప్రాంగణం భీతావహ దృశ్యాన్ని తలపించింది.

- అనకాపల్లి, అచ్యుతాపురం ఆస్పత్రుల్లో క్షతగాత్రులు
- ఏ- షిఫ్ట్ ఉద్యోగులు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఘటన
- భవన శిథిలాల కింద చిక్కుకున్న ఉద్యోగులు
- కర్మాగారంలో హాహాకారాలు

అచ్యుతాపురం, ఆగస్టు 21:

ఎప్పటిలాగే అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కార్మికులంతా బుధవారం ఉదయం విధులకు హాజరయ్యారు. సమయం సరిగ్గా మధ్యాహ్నం 1.50 గంటలు అయింది. ఏ- షిఫ్ట్ ముగిసింది. అప్పటికే బీ- షిఫ్ట్‌కి వాహనాల్లో ఉద్యోగులు వచ్చారు. వీరంతా వాహనాలు దిగి కర్మాగారంలోకి ప్రవేశిస్తున్నారు. ఈలోగా ఏ- షిఫ్ట్ ముగించుకొని కార్మికులు కార్మాగారం భవనం నుంచి బయటకు వస్తున్నారు. ఇంకో ఐదు నిమిషాల్లో వారు బయటకు వచ్చేస్తారు. బీ- షిఫ్ట్ ఉద్యోగులు వాహనాలు దిగి కర్మాగారం ప్రధాన గేటు దాటి లోనికి ... మిగతా 6వ పేజీలో




విలపిస్తున్న మృతుడు వెంకటసాయి కుటుంబ సభ్యులు



అచ్యుతాపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద క్షతగాత్రుల వివరాలు తెలుసుకుంటున్న అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్

నేడు సీఎం రాక



విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'ఎసెన్షియా' ఫార్మా కంపెనీని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సందర్శించనున్నారు. ఆయన ఉదయం 10.30 గంటల తరువాత విజయవాడ నుంచి విమానంలో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌కు వెళతారు. అనంతరం అనకాపల్లిలో ఎన్టీఆర్ ఏరియా ఆస్పత్రి, మరికొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శిస్తారు. అక్కడ నుంచి నగరానికి చేరుకుని కేజీహెచ్ చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శించనున్నారు.

క్షతగాత్రుల వివరాలు

ఎ.పరమేష్ (ఎలమంచిలి), వంగా శ్రీనివాస్ (టెక్కలి), ఎం.లోవ శ్రీనివాస్ (విశాఖపట్నం), పి.దేముడు (బోయపాలెం), పి.జగదీశ్వరరావు (నక్కపల్లి), పొన్నాడ జగదీష్ (గాజువాక), పి.ధనుంజయ (ఒడిశా), తమరాన గంగాధర్ (తీడ), జీరెడ్డి కాశి నాయుడు (నర్సీపట్నం), గెద్ద సంతోష్ (విజయనగరం), జి.సాయికుమార్ (బోనంగి), జాగారపు ప్రకాష్ (వేపాడ), ఎస్.అప్పారావు (రాంబిల్లి నేవీ కాలనీ), భూపతి శివవెంకటరత్నం (రాంబిల్లి), డి.అప్పారావు (ఎలమంచిలి), కె.నారాయణరావు (శ్రీకాకుళం), ప్రభాత్ యాదవ్ (వరంగల్), చందక బంగారు నాయుడు (విజయనగరం), కె.చంద్రశేఖర్ (బొబ్బిలి), జాగారపు వర్దన్ (జంగాల పాలెం), పి.జి.రాజా (రాంబిల్లి మండలం వెంకటాపురం), బి.సూరిబాబు (వై.లోవ), కె.రాంబాబు (రాంబిల్లి) ఎం.కిరణ్ సత్యనారాయణ (గాజువాక శ్రీనగర్) బి.రామునాయుడు, సీహెచ్ అప్పలరాజు, సత్యనారాయణ, నరేష్‌రెడ్డి, జీఎస్ వరప్రసాదరాజు, పి.అరుణకుమార్ (ఏ ప్రాంతానికి చెందినవారో తెలియాల్సి ఉంది). వీరంతా అచ్యుతాపురం, అనకాపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీ కట్టేందుకు కాకినాడ వెళ్లిన చల్లపల్లి హారిక బుధవారం తెల్లవారుజామున అచ్యుతాపురం వచ్చింది. కుటుంబ సభ్యులు ఉండమని అడిగినా సెలవు అయిపోయిందని చెప్పి విధులకు హాజరై రియాక్టర్ పేలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయింది.



క్షతగాత్రులు

దంపతుల బలవన్మరణం

ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య

- అప్పుల బాధ తట్టుకోలేక అఘాయిత్యం
- వడ్లపూడిలో ఘటన



గెద్దాడ శ్రీనివాసరావు, దేవి (ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం, ఆగస్టు 21: అప్పుల బాధ తట్టుకోలేక దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన వడ్లపూడిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి శెట్టిబలిజవీధికి చెందిన గెద్దాడ శ్రీనివాసరావు (40) డాక్‌యార్డులో పని చేస్తుంటాడు. ఇతడికి భార్య దేవి (36), పిల్లలు లోకేష్, మహి ఉన్నారు. దొండపర్తిలోని తన అన్నయ్య గణేష్‌కు రాఖీ కట్టడానికి దేవి భర్త పిల్లలతో కలిసి ఈనెల 19న వెళ్లింది. లోకేష్‌కు జ్వరంగా ఉందని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించాలని సూచించి పిల్లలను అతని వద్ద ఉంచి బుధవారం మధ్యాహ్నం భర్తతో కలిసి ఇంటికి చేరింది. అలా చేరిన వెంటనే దంపతులు ఇంట్లోని రెండు సీలింగ్ ఫ్యాన్‌లకు ఉరి వేసుకున్నారు. అయితే లోకేష్ వద్ద తల్లి సెల్‌ఫోన్ ఉండడంతో సాయంత్రం తండ్రికి ఫోన్ చేశాడు. తీయకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి, అమ్మా నాన్న ఫోన్ లిఫ్ట్ తీయడం లేదని, కనుక్కోవాలని కోరాడు. ఇంటికి వెళ్లిన బంధువులు తలుపుకొట్టినా తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా భార్యాభర్తలిద్దరూ ఫ్యాన్‌లకు వేలాడుతూ కనిపించారు. దీంతో చుట్టుపక్కల వారితో ... మిగతా 6వ పేజీలో

ఈపీడీసీఎల్‌లో బదిలీలకు గ్రీన్ సిగ్నల్

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రక్రియను ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించింది. అన్ని కేడర్లలో బదిలీ అవకాశాలను వెబ్‌సైట్‌లో ఈ నెల 24న ప్రదర్శిస్తారు. వెబ్ ఆప్షన్ల ద్వారా ఉద్యోగులు నచ్చిన స్థానాన్ని కోరుకోవచ్చు. ఈ నెల 25 నుంచి 29 వరకు ఆప్షన్లు తీసుకుంటారు. ముందుగా గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వం సూచించింది. చార్జిషీట్లు, ఏసీబీ కేసులు, విజిలెన్స్ కేసులున్నవారిని పరిగణనలోకి తీసుకోరు

సీఐల బదిలీలకు మోకాలడ్డు!

సమర్థులను తీసుకోవాలన్న సీపీ నిర్ణయానికి బ్రేక్

- చక్రం తిప్పుతున్న కూటమి నేతలు
- తమ వారికే పోస్టింగ్స్ ఇవ్వాలని ఓ కీలక ప్రజాప్రతినిధి పట్టు
- కమిషనరేట్‌ను ముంచెత్తుతున్న సిఫారసు లేఖలు
- తాత్కాలికంగా ప్రక్రియను పక్కనపెట్టినట్టు ప్రచారం



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. విధి నిర్వహణలో సమర్థత, నిజాయితీ ఉన్నవారిని మాత్రమే నగరంలో ఉంచి, మిగిలినవారిని రేంజ్‌కు సరండర్ చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి నిర్ణయించారు. ఈ మేరకు జాబితా సిద్ధం చేసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వంలోని కొంతమంది ప్రజాప్రతినిధుల జోక్యంతో ఈ ప్రక్రియ ముందుకుసాగని పరిస్థితి నెలకొంది. తాను చెప్పినవారందరికీ నగరంలోనే కీలకమైన పోస్టింగ్‌లు ఇవ్వాలని ఓ కీలక ప్రజా ప్రతినిధి పట్టుబట్టడంతో ఏంచేయాలో పాలుపోని సీపీ మొత్తం ప్రక్రియను తాత్కాలికంగా పక్కన పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

నగర పోలీస్ కమిషనరేట్‌లో సీఐల బదిలీల ప్రక్రియకు కూటమి నేతలు మోకాలడ్డుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో పోలీస్‌శాఖను బలోపేతం చేసేందుకు సమర్థులు, నిజాయితీపరులైన సీఐలను నియమించాలని సీపీ భావించారు. ఈ మేరకు సొంతంగా ఒక టీమ్‌ను తయారుచేసుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే పనిచేస్తున్నవారిలో సమర్థులు, నిజాయితీపరులు, అవినీతి ఆరోపణలు, ఇతరత్రా బలహీనతలున్న వారి వివరాలు సేకరించి జాబితాను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా కమిషనరేట్ నుంచి సుమారు 25 మంది సీఐలను రేంజ్‌కు సరండర్ చేసి వారిస్థానంలో సమర్థులను తీసుకోవాలని భావించారు. బదిలీల ప్రక్రియ చేపట్టేలోగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ రావడంతో ఉత్తర్వులు జారీకాలేదు. ఈలోగా జాబితాలో ఉన్నవారిలో కొందరు అప్రమత్తమయ్యారు. తమకు మేలు చేస్తారని భావించే ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి నగరంలోనే కొనసాగించడంతోపాటు కీలకమైన పోస్టింగ్ ఇచ్చేలా సీపీపై ఒత్తిడి తెస్తున్నారు. మరికొంతమంది నేతలు సిఫారసు లేఖలను ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

పోస్టింగ్‌లకు పట్టుబడుతున్న నేత

నగరంలో ప్రస్తుతం పనిచేస్తున్న కొందరు సీఐలపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలున్నాయి. ఎస్ఐలు, కానిస్టేబుళ్లపై మరి కొంతమంది నెట్టుకు వస్తున్నారు. ఇలాంటి వారంతా రేంజ్‌కు వెళ్లిపోతామని భావించి ఓ కీలక ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. తమను నగరంలోనే కొనసాగించడంతోపాటు ఆదాయం వచ్చే స్టేషన్లలో పోస్టింగ్ ఇప్పించాలని తీవ్రంగా ఒత్తిడి చేసినట్టు సమాచారం. దీంతో ఆ ప్రజాప్రతినిధి నేరుగా సీపీకి ఫోన్ చేసి, తాను సూచించిన చోట వారికి పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. అంతేకాదు రేంజ్ నుంచి సమర్థులను తీసుకోవాలనిభావించిన సీపీకి అక్కడి నుంచి కూడా జాబితాలో లేనివారిని తీసుకోవాలని సిఫారసులు అందినట్టు ... మిగతా 6వ పేజీలో

ఆది నుంచీ వివాదాస్పదమే!

ఎస్ఐ దేముడమ్మ తీరుపై ఆరోపణలు



విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన మల్కాపురం మహిళా ఎస్ఐ కొట్యాడ దేముడమ్మ వ్యవహారశైలిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2018 బ్యాచ్‌కు చెందిన ఆమె తొలుత స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. రెండేళ్ల కిందట మల్కాపురం బదిలీపై వచ్చారు. ఇక్కడ మూడేళ్లుగా సీఐలు మారుతుండడం ఆమెకు అవకాశంగా మారిందని సిబ్బంది చెబుతున్నారు. ఇక్కడి సీఐకి బదిలీ జరిగిన కొద్దిరోజులు తర్వాత మరొకరిని నియమించేవారు. దీనిని ఎస్ఐ దేముడమ్మ అవకాశంగా మార్చుకుని, తానే ఇన్‌చార్జి సీఐనంటూ హడావుడి చేసేవారని చెబుతున్నారు. కీలకమైన కేసుల విషయంలో ఏసీపీ, డీసీపీ స్థాయి అధికారులు కూడా ఈమె నుంచే సమాచారం తీసుకునేవారని, ఈక్రమంలో ఒక ఉన్నతాధికారికి ఆమె అనుచరురాలిగా మారారని చెబుతున్నారు. స్టేషన్ పరిధిలోని పరిశ్రమలు, నిర్మాణ రంగ కంపెనీల్లో ప్రమాదాలు జరిగినపుడు, సంబంధిత కంపెనీల ప్రతినిధులను బెదిరించి, ఉన్నతాధికారి వద్దకు పంపించేవారని, ఆ ఉన్నతాధికారి వారిని తన కార్యాలయంలో నిర్బంధించి భారీగా డబ్బులు గుంజేవాడని పలువురు చెబుతున్నారు. ఆయా అంశాలపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఆమె దూకుడుగా వ్యవహరించడం మొదలుపెట్టారని విశ్లేషిస్తున్నారు. ఇటీవల ఎన్నికల సమయంలో పోటీలో ఉన్న రాజకీయపార్టీల అభ్యర్థుల నుంచి కూడా ఆమె భారీగా వసూలుచేసినట్టు ఆరోపణలున్నాయి. కొద్దిరోజుల కిందటే ఆమె కొత్తగా ఇల్లు నిర్మించి గృహప్రవేశం చేయడంపై ఏసీబీ అధికారులు కూపీలాగుతున్నారు. దేముడమ్మ ఉద్యోగంలో చేరిన తర్వాత అధికారికంగా వచ్చే ఆదాయం ఎంత? అక్రమార్జన ఏమైనా చేశారా? అనే అంశాలపైన దృష్టిసారించినట్టు ప్రచారం జరుగుతోంది. నగరంలో పోలీసుల అధికారుల అవినీతి, ఇతర వ్యవహారాలపై సీపీ శంఖబ్రత బాగ్చీ ప్రత్యేకంగా దృష్టి సారించినప్పటికీ ఎలాంటి భయం లేకుండా దేముడమ్మ లాంటి అధికారులు అవినీతికి పాల్పడడం చర్చనీయాంశమవుతోంది.

ఏసీబీ వలలో మల్కాపురం ఎస్ఐ దేముడమ్మ - వివరాలు మెయిన్ 3లో

బాధిత విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థి ఫీజు చెల్లిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

మహారాణిపేట, ఆగస్టు 21: డిగ్రీ చదువుతున్న విద్యార్థి మణి కీర్తన్ తండ్రి ప్రమాదంలో మృతి చెందారు. ఈ స్థితిలో ఆ విద్యార్థి పరిస్థితి గుర్తించిన చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ ఆదుకునేందుకు ముందుకువచ్చింది. సైకిల్‌పై టీ విక్రయిస్తున్న వెంకటరావు అనే వ్యక్తి తన కుమారుడిని ఒక ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్సు చదివిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల పోర్టు రోడ్డులో లారీ ఢీకొనడంతో వెంకటరావు ప్రమాదంలో మృతి చెందారు. ఆర్థిక సమస్యతో ఆయన కుమారుడు మణికీర్తన్ చదువులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ బుధవారం అతని పూర్తి కాలేజీ ఫీజు రూ.80 వేలు యాజమాన్యానికి చెల్లించింది. ఈ సంస్థ కార్యదర్శి డి. శంకరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మర్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. శ్రీకాంత్, లక్కోజి నూకరాజు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యాచార నిందితులపై చర్యలు తీసుకోవాలి

» కొనసాగుతున్న నిరసన ర్యాలీలు



నిరసన తెలుపుతున్న బీఎస్ఎన్ఎల్ నాయకులు



కంచరపాలెంలో నినాదాలు చేస్తున్న ఐద్వా మహిళలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 21: కోల్‌కతాలో జరిగిన జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో బుధవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ నాయకులు మణి హాజరై మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వైద్యురాలి హత్య కేసునిందితులను కాపాడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగర్, మీనాకుమారి, ఉమా, దొర, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కంచరపాలెం : కోల్‌కతా ఆర్‌జీకర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేయడాన్ని కంచరపాలెం జోన్ సీపీఎం నాయకులు ఖండించారు.ఈ మేరకు స్థానిక రవీంద్రనగర్‌లో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ బాధితురాలు కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై హైకోర్టు సింగిల్ జడ్జితో విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళలు పి. సావిత్రి, గౌరి, గాయత్రి, నళిని తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి 'మెగాస్టార్ ఫ్యాన్'

డాబాగార్డెన్స్, ఆగస్టు 21: మెగాస్టార్ చిరంజీవిపై రూపొందించిన మెగాస్టార్ ఫ్యాన్ అనే చిత్రం వినాయక చవితికి విడుదల చేయనున్నట్టు యూనిట్ సభ్యులు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు పురస్కరించుకుని చిత్ర దర్శకుడు కిరణ్ వారియర్ బుధవారం మాట్లాడారు. ఈ చిత్రంలో హీరోగా లుక్స్ రాజు, హీరోయిన్‌గా సోనురెడ్డి, సై మూవీ ఫేమ్ సూర్య, సారిపల్లి సతీష్, జబర్దస్త్ అప్పారావు, యూవీ క్రియేషన్స్ నరసింహం ముఖ్యపాత్రల్లో నటించినట్టు చెప్పారు. ప్రొడ్యూసర్ శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు. క్రాంతి పిక్చర్స్ వారసుడు ఎన్‌వీ రెడ్డి ఒక కీలకపాత్రలో నటించారన్నారు.

వార్డు సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించాలి



ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతి పత్రమిస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు

మహారాణిపేట, ఆగస్టు 21: సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించాలని ఏపీ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు తమ సమస్యలపై దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సెక్రటరీలకు ఉన్న అధికారాలను వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు కూడా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె. గణేశ్‌కుమార్, కోశాధికారి చింతకాయల బంగార్రాజు, జిల్లా అధ్యక్షు డు ఎన్‌వీ సందీప్‌కుమార్, నాయకులు అశోక్‌కుమార్, పైడిరాజు, సాయికృష్ణ, సురేంద్ర రమేష్, మాజీ కార్పొరేటర్ బోయపాటి ఉమ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 2 నుంచి డిప్యూటీ సీఎం క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఆగస్టు 21: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు పురస్కరించుకుని సెప్టెంబరు 2 తేదీన 'డిప్యూటీ సీఎం టీ- 10' క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్టు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. వంశీ కృష్ణ, యువనేత, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. విద్యాసాగర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో 98 వార్డుల నుంచి 98 జట్లు ఈ పోటీల్లో పాల్గొవచ్చన్నారు. ఒక్క టీమ్‌లో 14 మంది ఆటగాళ్ల ఉండాలన్నారు. వన్‌టౌన్‌లోని వెలమపేట జీవీఎంసీ ఇందిర గాంధీ స్టేడియంలో 23 రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ముందుగాస్థానిక పార్టీ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీలు గోపి, రవికుమార్, పాల్గొన్నారు.

29న ఆర్థిక వ్యవస్థ అమలుపై సదస్సు: కలెక్టర్

మహారాణిపేట, ఆగస్టు 21: నగరంలోని హోటల్ నోవాటెల్‌లో ఈ నెల 29న ఆర్థిక వ్యవస్థ అమలుపై జరిగే సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు కేంద్ర పర్యావరణ అటవీ శాఖల కార్యదర్శులు, అదనపు కార్య దర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి హాజరుకానున్నట్టు చెప్పారు. వీరితో ఇతర రాష్ట్రాలకుచెందిన ప్రముఖులు, కార్య దర్శులు అధికారులు సుమారు 150 వరకు హాజరుకానున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమం ఇన్‌చార్జిగా జేసీమయూర్‌అశోక్ వ్యవహరిస్తారన్నారు.ఈ సమా వేశంలో జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



దుకాణాలు తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ వాణిశ్రీ

సీతంపేట, ఆగస్టు 21: రహదారుల పక్కన, డివైడర్లపై ఆక్రమించిన బడ్డీలను, తోపుడు బండ్లను పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

అక్కయ్యపాలెం: రహదారులను ఆక్ర మిస్తే సహించేదిలేదని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు వ్యాపారులను హెచ్చరించారు. దొండపర్తి డీఆర్ఎం ఆఫీస్ జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం దాలిరాజు సూపర్ మార్కెట్ వరకు రోడ్డుకిరువైపులా ఉన్న తోపుడు బండ్లను జీవీఎంసీ సిబ్బందితో కలిసి పోలీసులు తొలగించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు



ఇసుక పాయింట్‌ల తనిఖీలో సెబ్ అధికారులు

సీతమ్మధార, ఆగస్టు 21: ఇసుక నిల్వ చేసి అక్రమంగా విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో కలెక్టర్ ఆదేశాలపై సీతమ్మధార సెబ్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటఅప్పలనాయుడు, ఎస్ఐ ఎస్.ముసలనాయుడు సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. సీతమ్మధార, బానునగర్, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, రేసపువానిపాలెం, రామటాకీస్ ప్రాంతం, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో ఈ మేరకు దాడులు చేశారు.ఇటుక, కాంక్రీట్ అమ్ముతున్న ప్రదేశాలను, ఇసుక స్టాక్ పాయింట్‌ల్లో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా ఇసుక నిల్వలు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని వ్యాపారులనుహెచ్చరించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈనెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ బీకే నాయుడు తెలిపారు. గవరకంచరపాలెం,దుర్గానగర్, రెడ్డి కంచరపాలెం, సుభాస్‌నగర్, తుమ్మడిపాలెం, గొల్ల కంచరపాలెం, గోకుల్‌నగర్ పాంత వినియోగదారులు సహకరించాలన్నారు.

పదోతరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ పరీక్షలు

కంచరపాలెం, ఆగస్టు 21 : జీవీఎంసీ పరిధి ఆర్పీపేట, మాధవధార పాఠశాల్లో పదోతరగతి విద్యారులకు సీబీఎస్ఈ బేస్‌లైన్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఆంగ్ల పరీక్ష రాశారు. ఆర్పీపేట పాఠశాలలో 167 మంది విద్యార్థులకు 159 మంది పరీక్షకు హాజరయ్యారు. మాధవధారలో 155 మందికి 153మంది పరీక్ష రాశారు. గురువారం గణితం, శుక్రవారం జనరల్ సైన్స్, శనివారం సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్ నెట్ సౌకర్యం పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు అదనపు నెట్ సర్వీస్ కనెక్షన్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో వైఫై నెట్ కనెక్షన్‌కు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పిల్లల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజ్

జ్ఞానాపురం/కంచరపాలెం, ఆగస్టు 21: సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జ్ఞానాపురంలోని జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పిల్లల హక్కులపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజ్ మాట్లాడుతూ చిన్నారులకు వేధింపులనుంచి రక్షించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. డ్రగ్స్‌తో దుష్ఫలితాలు, బాలల హక్కులు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు చిన్నారులకు మంచి నడవడికను అలవరచాలని జీసీడీవో ఖలీషాబేగం అన్నారు. ఈ కార్యక్రమంలో డా.సూర్యప్రభ, పవిత్రి కాశ్యప్, సీడీపీఓ రమణకుమారి, బి. అరుణ, కె. శారద, ఎంఈవోలు బి.పైడపునాయుడు, బి.పుష్పరాగం, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


కొచువేలి- షాలిమార్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 21: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా కొచువేలి, షాలిమార్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు సర్వీసులను మరో నాలుగు ట్రిప్పులు పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో కొచువేలి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (06081) రైలు ఈనెల 23 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలోని షాలిమార్ - కొచువేలి ఎక్స్‌ప్రెస్ (06082) రైలు ఈనెల 26 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు అం దుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే..

కేకే లైన్ కిరండోల్ ప్రాంతంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యాలను దంతెవాడ వరకు కుదించినట్టు డీసీఎం తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ పాసింజర్ (08551) రైలు, విశాఖ - కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18514) రైళ్లు ఈనెల 22 నుంచి 28 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్- విశా ఖ పాసింజర్ (08552), కిరండోల్ - విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) రైళ్లు ఈ నెల 23 నుంచి 29 వరకు దంతెవాడ నుంచి బయలుదేరి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

చవితి రాట ఉత్సవం



ఆలయంలో రాట వేస్తున్న భక్తులు

సీతంపేట, ఆగస్టు 21: ప్రముఖ సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ రాటను బుధవారం వేశారు. స్థానిక కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జగదీశ్వరి దంపతులు పూజలు చేసి రాటను వేశారు. ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామలా దీపిక, టీడీపీ కార్యదర్శి ఎండీ నజీర్‌తోపాటు స్థానికులు పాల్గొన్నారు.

కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్‌గా రాజేశ్ ధనకర్

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్‌గా రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గన్నరీ, మిస్సైల్ స్పెషలిస్ట్. నేవీలోకి 1992లో ప్రవేశించారు. ఇక్కడికి రావడానికి ముందు సీ ట్రైనింగ్ ఫ్లాగ్ ఆఫీసర్‌గా పనిచేశారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందాలి

» అవసరమైతే ఎయిర్ అంబులెన్స్‌లు వినియోగించండి
» సంఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు నివేదిక ఇవ్వాలి
» అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అనకాపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలుఅందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఆదేశించారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు జిల్లాలో ప్రజాప్రతినిధులతో చంద్రబాబు బుధవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో క్షతగాత్రుల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రుల్లో వైద్యులను అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అవసరమైతే పరిస్థితి విషమించిన బాధితులను ఎయిర్ అంబులెన్స్‌లను వినియోగించి మెరుగైన వైద్యం కోసం తరలించాలన్నారు. ఇప్పటి వరకు 17 మంది మృతి చెందారని, మరికొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సీఎంకు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలను వివరించారు. ప్లాంట్ నిర్వహణలో మానవ తప్పిదం, నిర్మాణంలో జరిగిన లోపాలను వెల్లడించారు. ప్రమాదం జరిగిన అనంతరం ఫార్మా కంపెనీ యాజమాన్యం సరైన రీతిలో స్పందించలేదని పలువురు అధికారులు సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ముందు బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలన్నారు. ప్రమాదంలో ఇంత మంది ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందని, ప్రమాద సంఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు నివేదికను ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతి ఒక్క బాధితుడిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం హామీ ఇచ్చారు.

పరిశ్రమల్లో మొక్కుబడిగా తనిఖీలు

» ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మారని అధికారుల తీరు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని సెజ్‌లో తర చూ ప్రమాదాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అయినా పరిశ్ర మల యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అచ్యుతాపురం ఎస్ఈజెడ్, పరవాడ, రాంబిల్లి మండలాల పరిధిలో 145కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో గత పదేళ్లలో 48కి పైగా అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఆయా ప్రమాదాల్లో అనేక మంది ఉద్యోగులు, కార్మికులు మృతి చెందారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. పరవాడ మండలంలో రెండేళ్ల కిందట ప్రముఖ ఫార్మా కంపెనీలో ఐదుగురు ఉద్యోగులు మృతి చెందగా, పలువురు గాయాలపాలయ్యారు. ఏడాది కిందట అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో జీఎంఎఫ్ఎస్‌సీ ల్యాబ్‌లో రియాక్టర్ పేలి ఒకరు మృతి చెందగా, నలుగురు క్షతగాత్రులయ్యారు. పరవాడలోని ఓ కెమికల్ కంపెనీలో ముగ్గురు కార్మికులు అప్పట్లో మంటల్లో చిక్కుకొని చనిపోయారు. 2023 జూన్ నెలలో రాంబిల్లి మండలం సాయితీ ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగి ఇద్దరు ఉద్యోగులు మృతి చెందారు. నలుగురు గాయాల పాలయ్యారు. గత ఏడాది వసంత కంపెనీలో అగ్నిప్రమాదం జరిగి ఒడిశాకు చెందిన ఒకరు మృతి చెందారు. తాజాగా రాంబిల్లి మండలంలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.

తూతూమంత్రంగా తనిఖీలు

ఫార్మాకంపెనీల్లో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక, అగ్నిమాపక శాఖల అధికారులు ఏడాదిలో కనీసం నాలుగుసార్లుతనిఖీలు చేయాలి. కానీ మొక్కుబడిగా తనిఖీలు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నా యన్న ఆరోపణలున్నాయి.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరి శ్రమల్లో ప్రమాదాలుపునరావృతంకాకుండాచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విరుచుకుపడిన మృత్యువు

... 5వ పేజీ తరువాయి

వెళుతున్నారు. ఈలోగా భారీ శబ్దం వినిపించింది. దీంతో బీ-షిఫ్ట్ కార్మికులు ఉలిక్కి పడి వెనక్కి పరుగులు తీశారు. అప్పటికి ఏ-షిఫ్ట్ ఉద్యోగులు కొందరు పరుగులు తీసి బయటకు వచ్చారు. ఒక షిఫ్ట్‌కి ఇక్కడ 80 మంది పనిచేస్తారు. కర్మాగారంలో సుమారు 40 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఏం జరిగిందో తెలియదు, దట్టమైన పొగలు వ్యాపించాయి. భారీ పేలుడు సంభవించడంతో రియాక్టర్ పేలిందని కార్మికులు తెలుసుకున్నారు. లోనికి వెళ్లడానికి ఎవరూ సాహసించలేకపోయారు. అయినా ధైర్యం చేసి తోటి కార్మికులు కర్మాగారంలోకి ప్రవేశించారు. కర్మాగారంలో చెల్లాచెదురుగా కార్మికులు పడిపోయి ఉన్నారు. ఒంటి నిండా తీవ్ర గాయాలు, కొందరు స్పృహ కోల్పోయారు. దీంతో కర్మాగారంలో హాహాకారాలు మిన్నంటాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, కర్మాగారం బస్సుల్లో అచ్యుతాపురం ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఎంతమంది బయటకు వచ్చారో, ఎంతమంది కర్మాగారం లోపల ఉన్నారో తెలియని పరిస్థితి. కెమికల్‌తో కూడిన దట్టమైన పొగ కర్మాగార భవనం మొత్తం ఆక్రమించడంతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. హైడ్రోజన్ గ్యాస్ సిలిండర్ కూడా పేలడంతో ప్రమాద ఉధృతి పెరిగిందని అంటున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు వచ్చిన తరువాత సహాయక చర్యలు చురుకుగా సాగాయి. భవన శిథిలాల కింద చిక్కుకుపోయి ఛిద్రమైన మృతదేహాలను వెలికి తీశారు.

అనకాపల్లి ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, ఆగస్టు 21 : అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన పెను ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉద్యోగులకు ఎన్టీఆర్ వైద్యాలయం, పట్టణంలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఎస్ఈజెడ్ కాలనీ మోటూరుపాలెం గ్రామానికి చెందిన పూడి మోహనదుర్గాప్రసాద్(20), కాకినాడకు చెందిన సీహెచ్ హారిక (22)లు ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చేసరికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో విజయనగరం జిల్లాకు చెందిన పి.రాజశేఖర్ (23) కూడా మృతి చెందాడు. అచ్యుతాపురానికి చెందిన వై.చిన్నారావు(32) మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని కూడా ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చారని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురై ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చిన వారిలో తణుకు సమీపాన దువ్వ గ్రామానికి చెందిన బాబా శ్రీనివాసవర్మ, విజయనగరానికి చెందిన జి.చైతన్య, ఏలూరుకు చెందిన కె.సత్యనారాయణ, పి.మోహనసతీశ్‌లు వైద్యసేవలు పొందారు. వీరిలో బాబా శ్రీనివాసవర్మకు బలమైన గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించామని, మిగిలిన ముగ్గురికి ఎటువంటి ప్రాణహాని లేదని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న అడిషినల్ ఎస్పీ దేవప్రసాద్ ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చి సంఘటనలో మృతి చెందిన, క్షతగాత్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 14 మందిలో విజయనగరానికి చెందిన పి. రాజశేఖర్ (23) మృతి చెందగా, కె.చంద్రశేఖర్, జె.వరహాలరావు, జి.రాజా, బి.సూరిబాబు, కె. రాంబాబు, ఎం.కిరణ్ సత్యనారాయణ, బి.శివ వెంకటరత్నం, డి.అప్పారావు, ఆర్.వరలక్ష్మి, ఎస్. యామిని, కె.నారాయణరావు, ప్రభాత్‌యాదవ్, బంగారు చందకనాయుడు చికిత్స పొందుతున్నారు. వీరిలో రాంబిల్లికి చెందిన కె. రాంబాబు పరిస్థితి విషమయంగా ఉందని వైద్యులు తెలిపారు. అచ్యుతాపురం పవన్‌సాయి ఆస్పత్రిలో 13 మంది చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఎ.పరమేశ్, టి.శ్రీనివాస్, ఎం.లోవ శ్రీనివాస్, పి.దేముడు, పి.జగదీశ్వరరావు, పి.జగదీశ్, టి.ధనుంజయ్, టి.గంగాధర్, కె.కాశీరామ్, జి.సంతోశ్, జి.సాయికుమార్, జె.ప్రకాశ్, ఎస్.అప్పారావులు ఉన్నారు.

బాధితుల కన్నీరుమున్నీరు

ఈ ప్రమాదంలో పూడి మోహనదుర్గాప్రసాద్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో కన్నీరుమున్నీరుగా విలపించారు. తాను ఉదయం డ్యూటీకి వెళ్లి వచ్చేశానని, తన తమ్ముడు మోహనదుర్గాప్రసాద్ మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి మృతి చెందాడని అతని అన్న నానిబాబు విలపించాడు. ఇంటర్ చదివిన తన తమ్ముడు ఖాళీగా ఉండడం ఇష్టం లేక కేవలం నెలకు రూ.12 వేలు జీతానికి ఏడాది క్రితం విధుల్లో చేరాడని తెలిపారు.

దంపతుల బలవన్మరణం

... 5వ పేజీ తరువాయి

కలిసి తలుపులు బద్దలుగొట్టి లోపలకు వెళ్లారు. దువ్వాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏసీపీ త్రినాథ్, సీఐ ఎర్రంనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని సమాచారం సేకరించారు. అప్పుల బాధ తట్టుకోలేక అఘాయిత్యానికి పాల్పడి ఉంటారని బంధువులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనతో వడ్లపూడిలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతదేహాల వద్ద రెండు పేపర్లు పోలీసులకు లభించాయి. అందులో గణేష్ అన్నయ్య, అమ్మా పిల్లలను జాగ్రత్తగా చూసుకోండి. ఈ బొమ్మలు వారికే కొన్నాము. ఐ మిస్‌యూ... నన్ను క్షమించండి అన్నయ్యా..ఇట్లు దేవి అని మాత్రమే రాసి ఉంది. అయితే ఆత్మహత్యకు కారణాలేమిటనేది అందులో పేర్కొనలేదు.

సీఐల బదిలీలకు మోకాలడ్డు!

... 5వ పేజీ తరువాయి

సమాచారం. ప్రజాప్రతినిధులు చెప్పినట్టు పోస్టింగ్‌లు ఇస్తే నగరంలో పోలీసింగ్ కట్టుతప్పడంతోపాటు ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వస్తాయని సీపీ ఆందోళన చెందుతున్నట్టు కమిషనరేట్ అధికారులే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సిఫార్సుల మేరకు పోస్టింగ్‌లు ఇవ్వలేక... సిద్ధం చేసిన జాబితా మేరకు చర్యలు తీసుకోలేక మొత్తం ప్రక్రియను తాత్కాలికంగా పక్కన పెట్టేసినట్టు సమాచారం.

ఘోషాస్పత్రిలో సమస్యలపై డీఎంఈ ఆరా

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

జగదాంబ కూడలి, ఆగస్టు 21: వన్‌టౌన్‌లోని ఘోషాస్పత్రిలో సమస్యలపై మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) నరసింహం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. 'ఘోషాసుపత్రిలో సమస్యలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' లో ఇటీవల ప్రచురించిన కథనంపై ఆయన ఆరా తీశారు. ప్రధానంగా ఆస్ప త్రిలో రోగులకు సంఖ్యకు తగ్గట్టుగా వ సతుల కల్పన, పరిపాలనా భవనాలు. డైట్ భవనాల ఆధునీకరణ తదితర అంశాలపై డీఎంఈ చర్చించినట్టు సమాచారం. ఇటీవల డైట్ భవనానికి రంగులు వేయించి లోపల మరమ్మతు చేయించారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాల ఏర్పాటు అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. డేటాఎంట్రీ ఆపరేటర్ల పోస్టులు ఎఫ్ఎన్ఓ, ఎంఎన్‌ఓతోపాటు బయోమెడికల్ ఇంజనీరింగ్ పోస్టు భర్తీకి సిద్ధం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఆస్పత్రికి మంజూరైన రూ. 27 లక్షల విలువ చేసే జనరేటర్ ఏర్పాటుకు సూపరింటెండెంట్ చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఆసుపత్రిలో కరెంట్ కష్టాలు పూర్తి తొలగనున్నాయని వైద్యవర్గాలు సంతోషం వ్యక్తంచేస్తున్నాయి.



విత్తన బంతుల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు

విత్తన బంతులు తయారుచేసిన కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు

మల్కాపురం, ఆగస్టు 21: పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్కాపురం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు విత్తన బంతులు (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. నేరేడు, బొప్పాయి, మునగ, గంగరాని, తదితర విత్తన బంతులను తయారుచేసి పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో విసిరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యజిత్ మిశ్రా పర్యావరణ పరిరక్షణలో జేడీ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ లైబ్రేరియన్ ఆర్.జగన్‌మోహన్‌తో పాటు ఉపాధ్యాయులు, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో జల్ మిత్రలు కీలకం

పెందుర్తి, ఆగస్టు 21: గ్రామీణ ప్రాంతాల్లో జల్ మిత్రలు కీలకమని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా మహిళా సమాఖ్య కేంద్రంలో నిర్వహిస్తున్న నల్ జల్ మిత్ర శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి కుళాయిలు నిర్వహణలో మహిళలు కీలకంగా మారనున్నారన్నారు. జల్ మిత్రలకు సాంకేతికపరమైన టూల్ కిట్లు అందజేస్తామన్నారు. అనంతరం శిక్షణ పరికరాలు పరిశీలించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

పెందుర్తి, ఆగస్టు 21: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎన్.డి. లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు నాలుగు పోస్టులు మంజూరు కాగా, వీటిలో జనరల్ కేటగిరిలో ఆర్థిక శాస్త్రం, వొకేషనల్ విభాగంలో సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ ఆటోమొబైల్ టెక్నీషియన్. ఫిజియోథెరపీ విభాగాల్లో మూడు పోస్టులు ఉన్నట్టు పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఇటీవల ఉన్నత విద్య పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాను గురువారం సాయంత్రం ఐదు గంటల్లోగా విశాఖలోని జిల్లా వృత్తి విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0891-2713791 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

పెందుర్తి, ఆగస్టు 21: ఇక్కడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఐసీటీసీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం 'మీకు తెలుసా' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్ఐవీ, ఎస్‌టీఐ, సుఖవ్యాధులు, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ సురేశ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు.

'సీజనల్ వ్యాధులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి'

పెందుర్తి-రూరల్, ఆగస్టు 21: సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు వైద్య సిబ్బందికి సూచించారు. పురుషోత్తపురంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించి రోగులతో మాట్లాడారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవల గురించి అడిగి వారిని తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. అనాథ ఆశ్రమాలను సందర్శించి క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కోరాడ చందూ యాదవ్, ఆబోతు శ్రీను, పి.వి.రమణమూర్తి, వై.సత్యనారాయణ, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 27, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 25, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 32, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 4, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 21: జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు గ్రౌండ్ కాని గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెదగంట్యాడ మండలం నడుపూరు రెవెన్యూ పరిధిలో 160 ఎకరాల్లో నిర్మితమవుతున్న గృహాల లేఅవుట్‌ను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న గృహాలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు పనుల్లో పురోగతి ఉండాలని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నడుపూరు లేఅవుట్‌లో 6,216 గృహాలకు గాను 403 ఇళ్ల నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణశాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సత్యనారాయణ, తహసీల్దార్ రామారావు, తదితరులు ఉన్నారు.



నడుపూరు గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

నేటి మహా ధర్నాను విజయవంతం చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు

కూర్మన్నపాలెం, ఆగస్టు 21: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉక్కు కార్మిక వర్గంపై యాజమాన్యం ప్రదర్శిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఉక్కు పరిపాలనా భవనం వద్ద గురువారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చేపడుతున్న మహా ధర్నాలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్న పాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,287వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు కోసం ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేశారని, తమ భూములను కారుచౌకగా ఇచ్చిన నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలను గాలికొదిలేసి, సాధారణ ఉత్పత్తికి సైతం ముడిసరకు కేటాయించకుండా, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా ఉక్కు యాజమాన్యం దుర్మార్గపు ఆలోచనలతో ముందుకు సాగుతుండడం దారుణమన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం మూడున్నరేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేస్తామని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖర్చులు తగ్గించే నెపంతో కేంద్రంతో ఉక్కు యాజమాన్యం కుమ్మక్కై వందలాది మంది కార్మికులను పలు ప్రాంతాలకు బదిలీ చేయాలని చూస్తున్నట్టు వస్తున్న వార్తల వల్ల కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే చోటుచేసుకునే పరిణామాలకు ఉక్కు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు తెలిపారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

ఎస్సీ వర్గీకరణ వద్దంటూ కూర్మన్నపాలెంలో రాస్తారోకో

కూర్మన్నపాలెం, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణ వద్దంటూ కూర్మన్నపాలెం కూడలిలో బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే అంబేద్కర్ విజ్ఞాన వేదిక అధ్యక్షుడు కేబీఆర్ అంబేద్కర్, మాల మహానాడు నేత బి.జగ్జీవన్‌రామ్‌లు మాట్లాడుతూ ఆగస్టు ఒకటిన సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. అందువల్ల ఆ తీర్పును రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. విదసం నాయకుడు బూసి వెంకటరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు అన్నవి కేంద్రం, పార్లమెంటు పరిధిలో ఉండే అంశాలని, వాటిని రాష్ట్రాలకు బదలాయించడం రాజ్యాంగానికే అవమానమన్నారు. దళితసేన రాష్ట్ర నాయకుడు పాలేటి పెంటారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఏఐడీఆర్‌ఎఫ్ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తన తీర్పును పునఃసమీక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.శ్రీనివాసరావు, బీఏ స్వామి, ఎం.రాంబాబు, గుంజ చింతయ్య, గాలి ఆనంద్, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఈర్ల శ్రీరాములు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మల్కాపురం మెయిన్ రోడ్డులో..

మల్కాపురం: ఎస్సీ వర్గీకరణ పేరిట తమ సామాజికవర్గాన్ని విడదీయవద్దని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా మల్కాపురం మెయిన్ రోడ్డులో ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణ వద్దు..దళితుల ఐక్యతే ముద్దంటూ నినాదాలు చేశారు. రాస్తారోకో నిర్వహించి బస్సులు, ఇతర వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకుడు మాటూరి చిన్నారావు, ఎస్సీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుడాల ఈశ్వరరావు, సంఘం ప్రతినిధులు పి.లక్ష్మణరావు, హనుమంతరావు, ఎం.శంకరరావు, బి.సుబ్బారావు, ఆర్.అప్పారావు, ఎస్.సురేశ్, అజేయ్‌తో, తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో నినాదాలు చేస్తున్న నాయకులు

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

కూర్మన్నపాలెం, ఆగస్టు 21: వడ్లపూడి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 23వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కణితి ఆర్‌హెచ్ కాలనీ, అపెరల్ పార్కు, వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీ, సైమన్ నగర్, వుడా ఫేజ్-5, ఓషియన్ గ్రాన్స్ ఏరియాలకు విద్యుత్ సరఫరాను నిలిపిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆటోనగర్‌లో..

అదేవిధంగా చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు చినగంట్యాడ, ఎస్‌సీ కాలనీ, స్నేహపురి కాలనీ, కోర్టు ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ నాయుడు తెలిపారు.

బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలో..

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధి కణితి 11 కేవీ ఫీడర్, నాతయ్యపాలెం వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో ఈ నెల 23న నిర్వహణ పనులు చేపడుతున్నందున ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కారణంగా షీలానగర్ అయాన్ డిజిటల్ జోన్, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఏరియా, జీవీఎంసీ వాటర్ వర్క్స్, నవ్య అపార్టుమెంట్స్ లైన్, పంతులుగారి మేడ, చిట్టినాయుడు కాలనీ, దశమి కొండ పరిధి, ఆటోనగర్ జంక్షన్, కెనరా బ్యాంక్ ఏరియా, పద్మజ ఆస్పత్రి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెదగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో..

పెదగంట్యాడ: పెదగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ప్రగతి పార్కు ఏరియా, టింపనీ స్కూల్ ప్రాంతం, అమరావతి నగర్, భరత్ నగర్, సమతా నగర్, చిన నడుపూరు, పెద నడుపూరు, వెంపల్లి నగర్, శీకువానిపాలెం, సిద్ధేశ్వరం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి తమకు సహకరించవలసిందిగా కోరారు.

కృష్ణరాయపురం పరిధిలో..

వేపగుంట: కృష్ణరాయపురం పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి తెలిపారు. అందువల్ల కృష్ణరాయపురం, హౌసింగ్‌బోర్డు కాలనీ, సంతోష్‌నగర్, జ్యోతినగర్, జి.వి.కాలనీ, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కొళాయిల నుంచి బురద నీరు

స్థానికుల ఫిర్యాదుతో ఎల్లపువానిపాలెంలో పర్యటించిన జెడ్సీ హైమావతి

నేడు పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేత

గోపాలపట్నం, ఆగస్టు 21: గ్రేటర్ 89వ వార్డు ఎల్లపువానిపాలెంలో జడ్సీ హేమవతి బుధవారంలో పర్యటించారు. కొద్ది రోజులుగా జీవీఎంసీ కొళాయిల నుంచి బురద నీరు వస్తున్నట్టు ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆమె గ్రామాన్ని సందర్శించారు. బురద నీరు రావడానికి గల కారణాలను తాగునీటి సరఫరా విభాగం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాగా గ్రామంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నరవలోని గోదావరి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి భూగర్భ పైప్‌లైన్ ద్వారానీటి సరఫరా జరుగుతుందని, అయితే ఓవర్ హెడ్ ట్యాంక్ చాలా రోజులుగా శుభ్రపరచకపోవడంతో బురద నీరు వస్తున్నట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దీంతో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశాక నీటిని సరఫరా చేయాలని జెడ్సీ ఆదేశించారు. ఈ కారణంగా గురువారం ఎల్లపువానిపాలెం, ఎస్‌సీ కాలనీ, గణేశ్ నగర్, సంతోష్ నగర్, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

పెదగంట్యాడ, ఆగస్టు 21: గంగవరం పోర్టు రోడ్డులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం సెబ్ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. 'బ్లాక్‌లో ఇసుక' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సెబ్ అధికారులు స్పందించి దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను సెబ్ సీఐ లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకుని నిర్వాహకులను ప్రశ్నించారు. నకిలీ రశీదు, ఐదు టన్నుల అనధికార ఇసుకను తరలిస్తున్నట్టు తేలడంతో రూ.పది వేల జరిమానా విధించారు. ట్రాక్టర్‌లోని ఇసుకను అగనంపూడి డిపోకు తరలించారు.

నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

పెదగంట్యాడ, ఆగస్టు 21: ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు స్టీల్‌ప్లాంటులో కానీ దాని అనుబంధ సంస్థల్లో గానీ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉక్కు నిర్వాసిత నాయకులు బుధవారం ప్లాంట్ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.సునీతకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్లాంట్ కోసం ఇళ్లు, భూములు ఇచ్చిన నిర్వాసిత నిరుద్యోగులుగా సుమారు సుమారు ఏడున్నర వేల మంది ఉన్నారని, వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, యెల్లేటి శ్రీనివాసరావు, అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసిన జనసేన పార్టీ నాయకులు, అభిమానులు

అబుదాబీలో చిరంజీవి జన్మదిన వేడుకలు

మల్కాపురం, ఆగస్టు 21: గల్ఫ్‌లోని అబుదాబిలోని షాబియా ప్రాంతంలో జనసేన నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జనసేన జాతీయ కన్వీనర్ కేసరి త్రిమూర్తులు, పారిశ్రామికవేత్త మైనర్ బాబు కేక్ కట్ చేశారు. అనం తరం వారు మాట్లాడుతూ గల్ఫ్‌లో ఉన్న తెలుగు వారికి జనసేన అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఎస్‌పీ గ్రూప్ సభ్యులు, జనసేన నాయకులు కేవీ నారాయణ, నాని అద్దాల, కృష్ణకిశోర్, నరేశ్‌బాబు, కృష్ణ, కన్నబాబు, బాలాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో అభివృద్ధి పనులు పరిశీలన

కూర్మన్నపాలెం, ఆగస్టు 21: పేద ప్రజల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా త్వరితగతిన పనులు చేయాలని సూచించారు. వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు.



నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కార్మికులు

గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు కదలిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదగంట్యాడ, ఆగస్టు 21: పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అదనపు భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల ఏడున 'సమస్యల వలయంలో గ్రంథాలయం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా గ్రంథాలయ, జీవీఎంసీ అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.35 లక్షల వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయి. మూడున్నర నెలల క్రితం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినా, నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ఇబ్బందులు పడుతున్నట్టు వచ్చిన కథనానికి అధికారులు స్పందించి వారం రోజుల కిందట పనులు ప్రారంభించారు. మూడు నెలల్లోగా పనులు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

అగనంపూడి, ఆగస్టు 21: కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి సత్రం జంక్షన్‌లో గల మహాత్మ గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు మాట్లాడుతూ వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. డ్రగ్స్ మాఫియా ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుందనే కక్షతో ఈదారుణానికి పాల్పడ్డారన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో భెల్ హెచ్‌పీవీపీ వద్ద నిరసన

అక్కిరెడ్డిపాలెం: కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని వ్యతిరేకిస్తూ భెల్ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం భెల్ హెచ్‌పీవీపీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భెల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు మహిళల సంరక్షణకు చేసిన చట్టాలను ప్రభుత్వం కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సనపల జగన్నాథరావు, ఎస్.అప్పారావు, కె.నారపరెడ్డి, జి.అచ్చన్ననాయుడు, పి.కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

బండి సురేశ్‌కుమార్‌కు మంత్రి కొల్లు పరామర్శ



మంత్రి కొల్లు రవీంద్రతో మాట్లాడుతున్న బండి సురేశ్‌కుమార్

ఆటోనగర్, ఆగస్టు 21: వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ అధినేత బండి సురేశ్ కుమార్ తల్లి సుగుణ ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లి రవీంద్ర బుధవారం గ్రీన్‌సిటీలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. సుగుణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు, చిగురుపాటి రవికుమార్, పొన్నగంటి మురళీమోహన్, నల్ల రామారావు, సునీల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

అగనంపూడి, ఆగస్టు 21: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస ఆదర్శ హనుమాన్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీవరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు స్థానిక భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల వివరాలను వారు వెల్లడించారు. వినాయక ఉత్సవాల నేపథ్యంలో ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవాల ముగింపు రోజున అన్న సమారాధన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుదిరెడ్డి అప్పారావు, బి.సత్యనారాయణ, బి.శ్రీను, పైడిరాజు, వెంకటరమణ, అచ్చినాయుడు, కన్నారావు, వరహాలు, సింహాచలం, రాజు, చందూరమేశ్, గణేశ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థి ఫీజు చెల్లిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

మహారాణిపేట, ఆగస్టు 21: డిగ్రీ చదువుతున్న విద్యార్థి మణి కీర్తన్ తండ్రి ప్రమాదంలో మృతి చెందారు. ఈ స్థితిలో ఆ విద్యార్థి పరిస్థితి గుర్తించిన చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. సైకిల్‌పై టీ విక్రయిస్తున్న వెంకటరావు అనే వ్యక్తి తన కుమారుడిని ఒక ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదివిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల పోర్టు రోడ్డులో లారీ ఢీకొనడంతో వెంకటరావు ప్రమాదంలో మృతి చెందారు. ఆర్థిక సమస్యతో ఆయన కుమారుడు మణికీర్తన్ చదువులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ బుధవారం అతని పూర్తి కాలేజీ ఫీజు రూ.80 వేలు యాజమాన్యానికి చెల్లించింది. ఈ సంస్థ కార్యదర్శి డి. శంకరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. శ్రీకాంత్, లక్కోజి నూకరాజు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యాచార నిందితులపై చర్యలు తీసుకోవాలి

» కొనసాగుతున్న నిరసన ర్యాలీలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 21: కోల్‌కతాలో జరిగిన జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో బుధవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ నాయకులు మణి హాజరై మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వైద్యురాలి హత్య కేసునిందితులను కాపాడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగర్, మీనాకుమారి, ఉమా, దొర, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీఎస్ఎన్ఎల్ నాయకులు

కంచరపాలెం : కోల్‌కతా ఆర్‌జీకర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేయడాన్ని కంచరపాలెం జోన్ సీపీఎం నాయకులు ఖండించారు.ఈ మేరకు స్థానిక రవీంద్రనగర్‌లో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ బాధితురాలు కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై హైకోర్టు సింగిల్ జడ్జితో విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళలు పి. సావిత్రి, గౌరి, గాయత్రి, నళిని తదితరులు పాల్గొన్నారు.



కంచరపాలెంలో నినాదాలు చేస్తున్న ఐద్వా మహిళలు

వినాయక చవితికి 'మెగాస్టార్ ఫ్యాన్'

డాబాగార్డెన్స్, ఆగస్టు 21: మెగాస్టార్ చిరంజీవిపై రూపొందించిన మెగాస్టార్ ఫ్యాన్ అనే చిత్రం వినాయక చవితికి విడుదల చేయనున్నట్టు యూనిట్ సభ్యులు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు పురస్కరించుకుని చిత్ర దర్శకుడు కిరణ్ వారియర్ బుధవారం మాట్లాడారు. ఈ చిత్రంలో హీరోగా లుక్స్ రాజు, హీరోయిన్‌గా సోనురెడ్డి, సై మూవీ ఫేమ్ సూర్య, సారిపల్లి సతీష్, జబర్దస్త్ అప్పారావు, యూవీ క్రియేషన్స్ నరసింహం ముఖ్యపాత్రల్లో నటించినట్టు చెప్పారు. ప్రొడ్యూసర్ శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు. క్రాంతి పిక్చర్స్ వారసుడు ఎన్వీ రెడ్డి ఒక కీలకపాత్రలో నటించారన్నారు.

వార్డు సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించాలి



ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతి పత్రమిస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు

మహారాణిపేట, ఆగస్టు 21: సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించాలని ఏపీ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు తమ సమస్యలపై దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సెక్రటరీలకు ఉన్న అధికారాలను వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు కూడా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె. గణేశ్‌కుమార్, కోశాధికారి చింతకాయల బంగార్రాజు, జిల్లా అధ్యక్షుడు ఎన్వీ సందీప్‌కుమార్, నాయకులు అశోక్‌కుమార్, పైడిరాజు, సాయికృష్ణ, సురేంద్ర రమేష్, మాజీ కార్పొరేటర్ బోయపాటి ఉమ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 2 నుంచి డిప్యూటీ సీఎం క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఆగస్టు 21: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు పురస్కరించుకుని సెప్టెంబరు 2 తేదీన 'డిప్యూటీ సీఎం టీ- 10' క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్టు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. వంశీ కృష్ణ, యువనేత, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. విద్యాసాగర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో 98 వార్డుల నుంచి 98 జట్లు ఈ పోటీల్లో పాల్గొవచ్చన్నారు. ఒక్క టీమ్‌లో 14 మంది ఆటగాళ్ల ఉండాలన్నారు. వన్‌టౌన్‌లోని వెలమపేట జీవీఎంసీ ఇందిర గాంధీ స్టేడియంలో 23 రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ముందుగాస్థానిక పార్టీ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీలు గోపి, రవికుమార్, పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ పరీక్షలు

కంచరపాలెం, ఆగస్టు 21 : జీవీఎంసీ పరిధి ఆర్పీపేట, మాధవధార పాఠశాల్లో పదోతరగతి విద్యారులకు సీబీఎస్ఈ బేస్‌లైన్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఆంగ్ల పరీక్ష రాశారు. ఆర్పీపేట పాఠశాలలో 167 మంది విద్యార్థులకు 159 మంది పరీక్షకు హాజరయ్యారు. మాధవధారలో 155 మందికి 153మంది పరీక్ష రాశారు. గురువారం గణితం, శుక్రవారం జనరల్ సైన్స్, శనివారం సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్ నెట్ సౌకర్యం పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు అదనపు నెట్ సర్వీస్ కనెక్షన్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో వైఫై నెట్ కనెక్షన్‌కు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

29న ఆర్థిక వ్యవస్థ అమలుపై సదస్సు: కలెక్టర్

మహారాణిపేట, ఆగస్టు 21: నగరంలోని హోటల్ నోవాటెల్‌లో ఈ నెల 29న ఆర్థిక వ్యవస్థ అమలుపై జరిగే సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు కేంద్ర పర్యావరణ అటవీ శాఖల కార్యదర్శులు, అదనపు కార్య దర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి హాజరుకానున్నట్టు చెప్పారు. వీరితో ఇతర రాష్ట్రాలకుచెందిన ప్రముఖులు, కార్య దర్శులు అధికారులు సుమారు 150 వరకు హాజరుకానున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమం ఇన్‌చార్జిగా జేసీమయూర్‌అశోక్ వ్యవహరిస్తారన్నారు.ఈ సమా వేశంలో జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పిల్లల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజ్

జ్ఞానాపురం/కంచరపాలెం, ఆగస్టు 21: సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జ్ఞానాపురంలోని జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పిల్లల హక్కులపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజ్ మాట్లాడుతూ చిన్నారులకు వేధింపులనుంచి రక్షించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. డ్రగ్స్‌తో దుష్ఫలితాలు, బాలల హక్కులు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు చిన్నారులకు మంచి నడవడికను అలవరచాలని జీసీడీవో ఖలీషాబేగం అన్నారు. ఈ కార్యక్రమంలో డా.సూర్యప్రభ, పవిత్ర కాశ్యప్, సీడీపీఓ రమణకుమారి, బి. అరుణ, కె. శారద, ఎంఈవోలు బి.పైడపునాయుడు, బి.పుష్యరాగం, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



దుకాణాలు తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ

సీతంపేట, ఆగస్టు 21: రహదారుల పక్కన, డివైడర్లపై ఆక్రమించిన బడ్డీలను, తోపుడు బండ్లను పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

అక్కయ్యపాలెం: రహదారులను ఆక్ర మిస్తే సహించేదిలేదని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు వ్యాపారులను హెచ్చరించారు. దొండపర్తి డీఆర్ఎం ఆఫీస్ జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం దాలిరాజు సూపర్ మార్కెట్ వరకు రోడ్డుకిరువైపులా ఉన్న తోపుడు బండ్లను జీవీఎంసీ సిబ్బందితో కలిసి పోలీసులు తొలగించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ పాల్గొన్నారు.

కొచువేలి- షాలిమార్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 21: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా కొచువేలి, షాలిమార్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు సర్వీసులను మరో నాలుగు ట్రిప్పులు పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో కొచువేలి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (06081) రైలు ఈనెల 23 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలోని షాలిమార్ - కొచువేలి ఎక్స్‌ప్రెస్ (06082) రైలు ఈనెల 26 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు అం దుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే..

కేకే లైన్ కిరండోల్ ప్రాంతంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యాలను దంతెవాడ వరకు కుదించినట్టు డీసీఎం తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ పాసింజర్ (08551) రైలు, విశాఖ - కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18514) రైళ్లు ఈనెల 22 నుంచి 28 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్- విశా ఖ పాసింజర్ (08552), కిరండోల్ - విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) రైళ్లు ఈ నెల 23 నుంచి 29 వరకు దంతెవాడ నుంచి బయలుదేరి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

ఇసుక అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు



ఇసుక పాయింట్‌ల తనిఖీలో సెబ్ అధికారులు

సీతమ్మధార, ఆగస్టు 21: ఇసుక నిల్వ చేసి అక్రమంగా విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో కలెక్టర్ ఆదేశాలపై సీతమ్మధార సెబ్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటఅప్పలనాయుడు, ఎస్ఐ ఎస్.ముసలనాయుడు సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. సీతమ్మధార, భానునగర్, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, రేసపువానిపాలెం, రామటాకీస్ ప్రాంతం, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో ఈ మేరకు దాడులు చేశారు.ఇటుక, కాంక్రీట్ అమ్ముతున్న ప్రదేశాలను, ఇసుక స్టాక్ పాయింట్‌ల్లో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా ఇసుక నిల్వలు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని వ్యాపారులనుహెచ్చరించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈనెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ బీకే నాయుడు తెలిపారు. గవరకంచరపాలెం,దుర్గానగర్, రెడ్డి కంచరపాలెం, సుభాస్‌నగర్, తుమ్మడిపాలెం, గొల్ల కంచరపాలెం, గోకుల్‌నగర్ పాంత వినియోగదారులు సహకరించాలన్నారు.

చవితి రాట ఉత్సవం



ఆలయంలో రాట వేస్తున్న భక్తులు

సీతంపేట, ఆగస్టు 21: ప్రముఖ సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ రాటను బుధవారం వేశారు. స్థానిక కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జగదీశ్వరి దంపతులు పూజలు చేసి రాటను వేశారు. ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామలా దీపిక, టీడీపీ కార్యదర్శి ఎండీ నజీర్‌తోపాటు స్థానికులు పాల్గొన్నారు.

కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్‌గా రాజేశ్ ధనకర్

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్‌గా రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గన్నరీ, మిస్సైల్ స్పెషలిస్ట్. నేవీలోకి 1992లో ప్రవేశించారు. ఇక్కడికి రావడానికి ముందు సీ ట్రైనింగ్ ఫ్లాగ్ ఆఫీసర్‌గా పనిచేశారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందాలి

» అవసరమైతే ఎయిర్ అంబులెన్స్‌లు వినియోగించండి
» సంఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు నివేదిక ఇవ్వాలి
» అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అనకాపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలుఅందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఆదేశించారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు జిల్లాలో ప్రజాప్రతినిధులతో చంద్రబాబు బుధవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో క్షతగాత్రుల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రుల్లో వైద్యులను అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అవసరమైతే పరిస్థితి విషమించిన బాధితులను ఎయిర్ అంబులెన్స్‌లను వినియోగించి మెరుగైన వైద్యం కోసం తరలించాలన్నారు. ఇప్పటి వరకు 17 మంది మృతి చెందారని, మరికొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సీఎంకు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలను వివరించారు. ప్లాంట్ నిర్వహణలో మానవ తప్పిదం, నిర్మాణంలో జరిగిన లోపాలను వెల్లడించారు. ప్రమాదం జరిగిన అనంతరం ఫార్మా కంపెనీ యాజమాన్యం సరైన రీతిలో స్పందించలేదని పలువురు అధికారులు సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ముందు బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలన్నారు. ప్రమాదంలో ఇంత మంది ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందని, ప్రమాద సంఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు నివేదికను ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతి ఒక్క బాధితుడిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం హామీ ఇచ్చారు.

పరిశ్రమల్లో మొక్కుబడిగా తనిఖీలు

» ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మారని అధికారుల తీరు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని సెజ్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అయినా పరిశ్ర మల యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అచ్యుతాపురం ఎస్ఈజెడ్, పరవాడ, రాంబిల్లి మండలాల పరిధిలో 145కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో గత పదేళ్లలో 48కి పైగా అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఆయా ప్రమాదాల్లో అనేక మంది ఉద్యోగులు, కార్మికులు మృతి చెందారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. పరవాడ మండలంలో రెండేళ్ల కిందట ప్రముఖ ఫార్మా కంపెనీలో ఐదుగురు ఉద్యోగులు మృతి చెందగా, పలువురు గాయాలపాలయ్యారు. ఏడాది కిందట అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో జీఎంఎఫ్ఎస్‌సీ ల్యాబ్‌లో రియాక్టర్ పేలి ఒకరు మృతి చెందగా, నలుగురు క్షతగాత్రులయ్యారు. పరవాడలోని ఓ కెమికల్ కంపెనీలో ముగ్గురు కార్మికులు అప్పట్లో మంటల్లో చిక్కుకొని చనిపోయారు. 2023 జూన్ నెలలో రాంబిల్లి మండలం సాయితీ ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగి ఇద్దరు ఉద్యోగులు మృతి చెందారు. నలుగురు గాయాల పాలయ్యారు. గత ఏడాది వసంత కంపెనీలో అగ్నిప్రమాదం జరిగి ఒడిశాకు చెందిన ఒకరు మృతి చెందారు. తాజాగా రాంబిల్లి మండలంలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.

తూతూమంత్రంగా తనిఖీలు

ఫార్మాకంపెనీల్లో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక, అగ్నిమాపక శాఖల అధికారులు ఏడాదిలో కనీసం నాలుగుసార్లుతనిఖీలు చేయాలి. కానీ మొక్కుబడిగా తనిఖీలు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నా యన్న ఆరోపణలున్నాయి.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరి శ్రమల్లో ప్రమాదాలుపునరావృతంకాకుండాచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విరుచుకుపడిన మృత్యువు

... 5వ పేజీ తరువాయి

వెళుతున్నారు. ఈలోగా భారీ శబ్దం వినిపించింది. దీంతో బీ-షిఫ్ట్ కార్మికులు ఉలిక్కి పడి వెనక్కి పరుగులు తీశారు. అప్పటికి ఏ-షిఫ్ట్ ఉద్యోగులు కొందరు పరుగులు తీసి బయటకు వచ్చారు. ఒక షిఫ్ట్‌కి ఇక్కడ 80 మంది పనిచేస్తారు. కర్మాగారంలో సుమారు 40 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఏం జరిగిందో తెలియదు, దట్టమైన పొగలు వ్యాపించాయి. భారీ పేలుడు సంభవించడంతో రియాక్టర్ పేలిందని కార్మికులు తెలుసుకున్నారు. లోనికి వెళ్లడానికి ఎవరూ సాహసించలేకపోయారు. అయినా ధైర్యం చేసి తోటి కార్మికులు కర్మాగారంలోకి ప్రవేశించారు. కర్మాగారంలో చెల్లాచెదురుగా కార్మికులు పడిపోయి ఉన్నారు. ఒంటి నిండా తీవ్ర గాయాలు, కొందరు స్పృహ కోల్పోయారు. దీంతో కర్మాగారంలో హాహాకారాలు మిన్నంటాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, కర్మాగారం బస్సుల్లో అచ్యుతాపురం ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఎంతమంది బయటకు వచ్చారో?, ఎంతమంది కర్మాగారం లోపల ఉన్నారో తెలియని పరిస్థితి. కెమికల్‌తో కూడిన దట్టమైన పొగ కర్మాగార భవనం మొత్తం ఆక్రమించడంతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. హైడ్రోజన్ గ్యాస్ సిలిండర్ కూడా పేలడంతో ప్రమాద ఉధృతి పెరిగిందని అంటున్నారు. ఎన్డీఆర్ఎఫ్ దళాలు వచ్చిన తరువాత సహాయక చర్యలు చురుకుగా సాగాయి. భవన శిథిలాల కింద చిక్కుకుపోయి ఛిద్రమైన మృతదేహాలను వెలికి తీశారు.

అనకాపల్లి ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, ఆగస్టు 21 : అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన పెను ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉద్యోగులకు ఎన్టీఆర్ వైద్యాలయం, పట్టణంలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఎస్ఈజెడ్ కాలనీ మోటూరుపాలెం గ్రామానికి చెందిన పూడి మోహనదుర్గాప్రసాద్(20), కాకినాడకు చెందిన సీహెచ్ హారిక (22)లు ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చేసరికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో విజయనగరం జిల్లాకు చెందిన పి.రాజశేఖర్ (23) కూడా మృతి చెందాడు. అచ్యుతాపురానికి చెందిన వై.చిన్నారావు(32) మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని కూడా ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చారని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురై ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చిన వారిలో తణుకు సమీపాన దువ్వ గ్రామానికి చెందిన బాబా శ్రీనివాసవర్మ, విజయనగరానికి చెందిన జి.చైతన్య, ఏలూరుకు చెందిన కె.సత్యనారాయణ, పి.మోహనసతీశ్‌లు వైద్యసేవలు పొందారు. వీరిలో బాబా శ్రీనివాసవర్మకు బలమైన గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించామని, మిగిలిన ముగ్గురికి ఎటువంటి ప్రాణహాని లేదని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న అడిషినల్ ఎస్పీ దేవప్రసాద్ ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చి సంఘటనలో మృతి చెందిన, క్షతగాత్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 14 మందిలో విజయనగరానికి చెందిన పి. రాజశేఖర్ (23) మృతి చెందగా, కె.చంద్రశేఖర్, జె.వరహాలరావు, జి.రాజా, బి.సూరిబాబు, కె. రాంబాబు, ఎం.కిరణ్ సత్యనారాయణ, బి.శివ వెంకటరత్నం, డి.అప్పారావు, ఆర్.వరలక్ష్మి, ఎస్. యామిని, కె.నారాయణరావు, ప్రభాత్‌యాదవ్, బంగారు చందకనాయుడు చికిత్స పొందుతున్నారు. వీరిలో రాంబిల్లికి చెందిన కె. రాంబాబు పరిస్థితి విషమయంగా ఉందని వైద్యులు తెలిపారు. అచ్యుతాపురం పవన్‌సాయి ఆస్పత్రిలో 13 మంది చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఎ.వరమేశ్, టి.శ్రీనివాస్, ఎం.లోవ శ్రీనివాస్, పి.దేముడు, పి.జగదీశ్వరరావు, పి.జగదీశ్, టి.ధనుంజయ్, టి.గంగాధర్, కె.కాశీరామ్, జి.సంతోశ్, జి.సాయికుమార్, జె.ప్రకాశ్, ఎస్.అప్పారావులు ఉన్నారు.

బాధితుల కన్నీరుమున్నీరు

ఈ ప్రమాదంలో పూడి మోహనదుర్గాప్రసాద్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో కన్నీరుమున్నీరుగా విలపించారు. తాను ఉదయం డ్యూటీకి వెళ్లి వచ్చేశానని, తన తమ్ముడు మోహనదుర్గాప్రసాద్ మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి మృతి చెందాడని అతని అన్న నానిబాబు విలపించాడు. ఇంటర్ చదివిన తన తమ్ముడు ఖాళీగా ఉండడం ఇష్టం లేక కేవలం నెలకు రూ.12 వేలు జీతానికి ఏడాది క్రితం విధుల్లో చేరాడని తెలిపారు.

దంపతుల బలవన్మరణం

... 5వ పేజీ తరువాయి

కలిసి తలుపులు బద్దలుగొట్టి లోపలకు వెళ్లారు. దువ్వాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏసీపీ త్రినాథ్, సీఐ ఎర్రంనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని సమాచారం సేకరించారు. అప్పుల బాధ తట్టుకోలేక అఘాయిత్యానికి పాల్పడి ఉంటారని బంధువులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనతో వడ్లపూడిలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతదేహాల వద్ద రెండు పేపర్లు పోలీసులకు లభించాయి. అందులో గణేష్ అన్నయ్య, అమ్మా పిల్లలను జాగ్రత్తగా చూసుకోండి. ఈ బొమ్మలు వారికే కొన్నాము. ఐ మిస్‌యూ... నన్ను క్షమించండి అన్నయ్యా...ఇట్లు దేవి అని మాత్రమే రాసి ఉంది. అయితే ఆత్మహత్యకు కారణాలేమిటనేది అందులో పేర్కొనలేదు.

సీఐల బదిలీలకు మోకాలడ్డు!

... 5వ పేజీ తరువాయి

సమాచారం. ప్రజాప్రతినిధులు చెప్పినట్టు పోస్టింగ్‌లు ఇస్తే నగరంలో పోలీసింగ్ కట్టుతప్పడంతోపాటు ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వస్తాయని సీపీ ఆందోళన చెందుతున్నట్టు కమిషనరేట్ అధికారులే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సిఫార్సుల మేరకు పోస్టింగ్‌లు ఇవ్వలేక... సిద్ధం చేసిన జాబితా మేరకు చర్యలు తీసుకోలేక మొత్తం ప్రక్రియను తాత్కాలికంగా పక్కన పెట్టేసినట్టు సమాచారం.

ఘోషాస్పత్రిలో సమస్యలపై డీఎంఈ ఆరా

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

జగదాంబ కూడలి, ఆగస్టు 21: వన్‌టౌన్‌లోని ఘోషాస్పత్రిలో సమస్యలపై మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) నరసింహం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. 'ఘోషాసుపత్రిలో సమస్యలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' లో ఇటీవల ప్రచురించిన కథనంపై ఆయన ఆరా తీశారు. ప్రధానంగా ఆస్ప త్రిలో రోగులకు సంఖ్యకు తగ్గట్టుగా వ సతుల కల్పన, పరిపాలనా భవనాలు. డైట్ భవనాల ఆధునీకరణ తదితర అంశాలపై డీఎంఈ చర్చించినట్టు సమాచారం. ఇటీవల డైట్ భవనానికి రంగులు వేయించి లోపల మరమ్మతు చేయించారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాల ఏర్పాటు అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. డేటాఎంట్రీ ఆపరేటర్ల పోస్టులు ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓతోపాటు బయోమెడికల్ ఇంజనీరింగ్ పోస్టు భర్తీకి సిద్ధం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఆస్పత్రికి మంజూరైన రూ. 27 లక్షల విలువ చేసే జనరేటర్ ఏర్పాటుకు సూపరింటెండెంట్ చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఆసుపత్రిలో కరెంట్ కష్టాలు పూర్తి తొలగనున్నాయని వైద్యవర్గాలు సంతోషం వ్యక్తంచేస్తున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఆగస్టు 21 : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఆపరేషన్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత పనుల కారణంగా విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, కైలాసగిరి రోడ్డు, చలపతినగర్, సంజీవ్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

మధురవాడ పరిధిలో...

మధురవాడ : నగరంపాలెం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా గణేష్‌నగర్, పోర్ట్ కాలనీ, కళానగర్, బొట్టవాని పాలెం, స్వతంత్రనగర్, డాక్‌యార్డు కాలనీ, వాంబే కాలనీ, శ్రీనివాసా నగర్, నగరంపాలెం ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రామ్మూర్తి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఆగస్టు 21 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, ఆగస్టు 21 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని బాలాజీ గార్డెన్స్‌కు చెందిన గరిమెళ్ల సూర్య వెంకటలక్ష్మీనారాయణ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ పీఆర్‌ఓ సిరిపురపు కనకరాజుకు ఆయన బుధవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, ఆగస్టు 21 : కేంద్ర కారాగారానికి సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కొన్ని, ఐదవ తరగతిలో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వీటికి ఎస్సీ, ఎస్టీ బాలురు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 90103 79390 నంబర్‌ను సంప్రతించాలని సూచించారు.

పద్మనాభంలో కానరాని బంద్ ప్రభావం

పద్మనాభం (రూరల్), ఆగస్టు 21 : సుప్రీంకోర్టు ఇటీవల ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌పై ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు బుధవారం సంయుక్తంగా పిలుపునిచ్చిన భారత్ బంద్ ప్రభావం మండలంలో ఎక్కడా కనిపించలేదు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి, ఆర్‌టీసీ బస్సులు, ఆటోలు ఎప్పటిలాగే రాకపోకలు సాగించాయి. దీంతో మండలంలో బంద్ ప్రభావం పెద్దగా కానరాలేదు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య, విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, సంగం, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **భారతీయుడు-2 :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 27, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 120, బరబటి 25, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 32, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 4, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 76, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

పాఠశాలలను అభివృద్ధి చేయండి

- విద్యార్థుల సంఖ్య కూడా పెంచండి
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- స్కూల్ కమిటీ సభ్యులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ఆనందపురం/పద్మనాభం, ఆగస్టు 21 : సాధారణ ఎన్నికల అనంతరం జరిగిన స్కూల్ కమిటీ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి 98 శాతం విజయం నమోదు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సాధారణ ఎన్నికల్లో తనను 94 వేల ఓట్ల భారీ మెజారీతో గెలిపించారని, పాఠశాలల కమిటీ ఎన్నికల్లో అంతకుమించిన ఫలితాలను ఇచ్చారని చెప్పారు. పెద్దిపాలెం చెన్నా ఫంక్షన్ హాల్‌లో కొత్తగా ఎన్నికైన స్కూల్ కమిటీ సభ్యులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగానే విద్యా వ్యవస్థను ప్రతిష్ఠం చేయడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం చేశారని తెలిపారు. స్కూల్ కమిటీలు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోకుండా ప్రభుత్వ ఆలోచనలు, విధానాలను అమలు చేయడంలో కీలక పాత్ర పోషించి, పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతిభ గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కమిటీలు ఈ విషయాన్ని ఛాలెంజ్‌గా తీసుకుని విద్యార్థుల సంఖ్య పెంచాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేసి వాటికి ప్రోత్సాహకాలు ఇవ్వడానికి విధి విధానాలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలలను మించి చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో చేరికలు ఉండడాన్ని మిగిలిన వారు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు ఉపయోగించుకోవాలని చెప్పారు. అనంతరం చంద్రంపాలెం, యల్లపువానిపాలెం, బోని, పద్మనాభం, అడవివరం తదితర పాఠశాల కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రాజబాబు, డీవీఎన్ రాజు, కె. రామానాయుడు, చిక్కాల విజయ్‌బాబు, పివి నరసింహం, గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, సొంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో జీవీఎంసీ కమిషనర్ సమీక్ష



వెంకోజీపాలెం, ఆగస్టు 21 : నగర ప్రజలకు కల్పిస్తున్న మౌలిక వసతులపై జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ బుధవారం తన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో తాగునీటి కుళాయి కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి, తాగునీటికి ప్రతిరోజూ నాణ్యతా పరీక్షలు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అలాగే మురుగునీటి శుద్ధి కేంద్రానికి ఎంతమేర మురుగు వస్తుంది, ఎంతమేర శుద్ధి చేసి ఏవిధంగా దాన్ని వినియోగిస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాల విభజన, చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు, పునర్వినియోగం తదితర వాటిపై కూడా అడిగారు. పీపీపీ ప్రాజెక్టులు నగరంలో కొత్తగా ఎన్ని ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందని ప్రశ్నించారు. కాలువలు, గెడ్డల్లో ఎప్పటికప్పుడు పూడికలు తీయాలని సూచించారు. జీవీఎంసీకి ఆర్థిక వనరులు ఏవిధంగా సమకూర్చుకోవాలో అధికారులను అడిగి తెలుసుకుని, ఎస్‌హెచ్‌జీ గ్రూపులను బలోపేతం చేసి వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించేలా ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతి అందిస్తున్న మత్స్యకారులు

శ్మశానవాటికను పరిరక్షించాలని వినతి

భీమునిపట్నం, ఆగస్టు 21 : బీచ్‌రోడ్‌లో వున్న జలగెడ్డ శ్మశానవాటికను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఎగువపేట మత్స్యకారులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. బుధవారం వారు పట్టణంలోని క్యాంపు కార్యా లయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశానవాటికను ఎగువపేట గ్రామ మత్స్యకారులు పూర్వం నుంచీ వినియోగిస్తున్నారన్నారు. ఇటీవల బీచ్‌రోడ్‌ను ఆనుకుని ఏర్పాటు చేసిన రెస్టారెంట్ యాజమాన్యం శ్మశానవాటిక ఆక్రమణకు పాల్పడడంతో పాటు రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుందని ఆరోపించారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, సభ్యులు అప్పారావు, మైలపల్లి షణ్ముఖరావు, వాసుపల్లి కొండబాబు, కారి చిన్న, బర్రి కొండ, ఉమ్మడి చిన్న, పుక్కళ్ల నల్లయ్య, గంటా ఎల్లాజీరావు, వాసుపల్లి భార్గవ్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో దివీస్ ప్రతినిధులు

బాక్సింగ్ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 21 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాక్సింగ్ క్రీడాకారులకు చిప్పాడ దివీస్ కర్మాగారంలో బుధవారం నగదు ప్రోత్సాహకం అందించారు. జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు చేతుల మీదుగా జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో బహుమతులు పొందిన క్రీడాకారులకు నగదు అందించారు. అలాగే వచ్చే నెల 4 నుంచి 7వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు హాజరుకానున్న వారికి ఎంట్రీ ఫీజు, ప్రయాణ ఖర్చులు కూడా అందించారు. కార్యక్రమంలో దివీస్ ఉద్యోగులు ఎస్‌వీ రమణ, రామకృష్ణ, కోచ్ ఆదినారాయణ పాల్గొన్నారు.

బాలికల ఆత్మ రక్షణకు శిక్షణ అవసరం



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ నేతలు

సింహాచలం, ఆగస్టు 21 : బాలికలకు ఆత్మ రక్షణ శిక్షణ అవసరమని, పాఠశాలల స్థాయి నుంచే దీన్ని నేర్పించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. మంగతాయార్ అన్నారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య నేపథ్యంలో బీజేపీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బుధవారం కొండదిగువ తొలిపావంచా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో పీఈటీలు మాదిరిగానే కరాటే శిక్షకులను ఏర్పాటు చేసి బాలికలకు ఆత్మ రక్షణలో శిక్షణ ఇప్పించాలన్నారు ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నేత పూడిపెద్ది శర్మ, మీసాల రవీంద్ర, కందాళ ఫణీంద్ర,మాడెం రామకృష్ణ, జయరాజ్, బి. నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలని ర్యాలీ



తగరపువలసలో ర్యాలీ చేస్తున్న ఐద్వా మహిళలు

తగరపువలస, ఆగస్టు 21 : మహిళలకు ఆత్మ రక్షణ కల్పించాలని, లైంగిక వేధింపుల నుంచి కాపాడాలని కోరుతూ బుధవారం సాయంత్రం తగరపువలసలో ఐద్వా, సీఐటీయూ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన, మానవహారం చేపట్టారు. అనంతరం తగరపువలస మెయిన్ రోడ్డులో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు శ్రీదేవి మాట్లాడుతూ ఎన్ని చట్టాలు ఉన్నా..మహిళలపై అత్యాచారాలు తగ్గడం లేదన్నారు. చట్టాలను మరింత కఠినతరం చేయాలని కోరారు. గంజాయి, అసభ్యకర సినిమాలు, సెల్‌ఫోన్లు వల్ల అనేక నేరాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింగరావు, అప్పలనాయుడు, ఐద్వా నాయకులు పద్మ, కాంతమ్మ, రమణమ్మ, మాధవి పాల్గొన్నారు.

కొమ్మాది : కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ డిమాండ్ చేసింది. జోన్-2 కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్ష, కార్యదర్శులు పి. రాజ్‌కుమార్, డి. కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం



విద్యార్థి మిథినేష్‌ను సత్కరిస్తున్న ఎంఈఓలు

వెంకోజీపాలెం, ఆగస్టు 21 : జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థి మిథినేష్ బీసీ గురుకుల పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈమేరకు ఆ పాఠశాలలో సీతమ్మధార ఎంఈఓ-1 రామారావు, ఎంఈఓ-2 బాలామణి విద్యార్థిని బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

పెందుర్తి, ఆగస్టు 21: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.డి. లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు నాలుగు పోస్టులు మంజూరు కాగా, వీటిలో జనరల్ కేటగిరిలో ఆర్థిక శాస్త్రం, వొకేషనల్ విభాగంలో సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ ఆటోమొబైల్ టెక్నీషియన్. ఫిజియోథెరపీ విభాగాల్లో మూడు పోస్టులు ఉన్నట్టు పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఇటీవల ఉన్నత విద్య పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాను గురువారం సాయంత్రం ఐదు గంటల్లోగా విశాఖలోని జిల్లా వృత్తి విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0891-2713791 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జగన్‌తో ముత్తంశెట్టి భేటీ



భీమునిపట్నం, ఆగస్టు 21 : వైసీపీ అధినేత జగన్‌తో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తాడేపల్లిలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి ఉత్తరాంధ్రలోని పలు విషయాలతో పాటు నియోజకవర్గంలోని సమస్యలపై జగన్‌తో చర్చించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

పద్మనాభం (రూరల్), ఆగస్టు 21 : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నామని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశు వైద్యాధికారి మహేష్ తెలిపారు. బుధవారం ఆయన కృష్ణాపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల 18 వరకు టీకాలు వేయనున్నట్టు చెప్పారు.

నేటి నుంచి ఉపాధి పనులపై గ్రామసభలు

పద్మనాభం (రూరల్), ఆగస్టు 21 : మండలంలో ఉపాధి పనుల ఎంపికకు సంబంధించి శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను నూతన పనుల ఎంపిక, ఆమోదం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

కాలువల్లో పేరుకుపోయిన పూడిక

ఆరిలోవ, ఆగస్టు 21 : జీవీఎంసీ 11వ వార్డు పార్వతీనగర్‌లో ఉన్న కాలువ పూడికతో నిండిపోవడంతో మురుగు నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కాలువలోని నీరు రోడ్డుపై రావడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెలువడుతోంది. అలాగే దోమల వ్యాప్తి కూడా అధికమవుతోంది. కొన్ని నెలలుగా పూడికలు తీయలేదని స్థానికులు చెబుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కాలువ నుంచి బయటకు వచ్చిన మురుగు నీరు



పద్మనాభం-శొంఠ్యాం రోడ్డులో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

శిథిలమైన కల్వర్టుతో అవస్థలు

పద్మనాభం, ఆగస్టు 21 : పద్మనాభం-శొంఠ్యాం రోడ్డులోని మద్ది ఇసుక గెడ్డ మీద ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనాల రాకపోకలకు విఘాతం కలుగుతోంది. ఐదు దశాబ్దాల క్రితం ఈ కల్వర్టు నిర్మించారు. సుమారు పదేళ్ల క్రితం ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టినా కల్వర్టును విస్తరించి అభివృద్ధి చేయడంలో ఆర్‌అండ్‌బీ శాఖ అలక్ష్యం వహించడంతో ఇది ఎప్పుడు కూలిపోతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి దగ్గరలోనే దివాన్లీ కాలువపై ఉన్న పాత కల్వర్టు స్థానంలో కొత్తగా నిర్మించినప్పుడు దీనిపై ఎందుకు నిర్లక్ష్యం వహించడమని పలువురు నిలదీస్తున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు కల్వర్టు వద్ద ఒక వాహనం ఆగిన తరువాత మరో వాహనం వెళ్లాల్సి వస్తోంది. దీనికితోడు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు సహితం కూలిపోవడంతో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి లోలెవిల్‌లో ఉన్న కల్వర్టును ప్రస్తుత అవసరాల మేరకు విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్రిన్సిపాల్ దండనపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

సింహాచలం, ఆగస్టు 21 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద, నాద, ఆగమ పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ దండన ఇచ్చిన ఘటనపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆరా తీసింది. ఈమేరకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్ బుధవారం పాఠశాలను సందర్శించారు. జరిగిన ఘటనపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు శారీరక దండన విధించడం వాస్తవమేనని, అధికారుల మధ్య సమన్వయ లోపం, అంతర్గత కుమ్ములాటలు ఉన్నట్టు గుర్తించామన్నారు. మరికొన్ని ఫిర్యాదులు కూడా అందాయని చెప్పారు. పాఠశాలకు దేవస్థానం కల్పిస్తున్న వసతి, భోజన సదుపాయం, వైద్యం, మరుగుదొడ్ల వంటి సదుపాయాలపై కూడా వివరాలు సేకరించామని తెలిపారు. విద్యార్థులపై శారీరక దండన తప్పుగా భావించాల్సి ఉందని, సమగ్ర నివేదికను దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులతో పాటు దేవస్థానం సహాయ కార్యనిర్వాహణాధికారి రాజేంద్ర కుమార్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని జాగృతం చేసే బాధ్యత యువతదే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి

భీమునిపట్నం, ఆగస్టు 21 : సమాజాన్ని జాగృతం చేసే బాధ్యత యువతపై ఉందని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విష్ణుమూర్తి అన్నారు. బుధవారం కళాశాలలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ సమాజాన్ని ఏవిధంగా నాశనం చేస్తుందో వివరించారు. ఏపీఎస్ఏసీఎస్ ప్రాజెక్టు మేనేజర్ రవి భాస్కర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ సంక్రమించే నాలుగు మార్గాలను వివరించారు. యువత జాగ్రత్తగా ఉండడమే కాకుండా సమాజాన్ని జాగృతం చేయాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ యూనిట్ వన్, టుత్రీ ప్రోగ్రామ్ అధికారులు డి. ప్రవీణ, అప్పలనాయుడు, సహదేవుడు, పి. గౌరీశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జలతరంగ్ పోటీలు



పోటీల్లో గెలుపొందిన విజేతలు

భీమునిపట్నం, ఆగస్టు 21 : బీచ్‌రోడ్ కళింగ నేవల్ స్టేషన్‌లో మంగళవారం ఇంటర్ డిపార్ట్‌మెంటల్ జలతరంగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. నేవీ ఉద్యోగులతో పాట అగ్నివీర్‌లు కూడా పోటీల్లో పాల్గొన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

వైసీపీ నేత రమణ మృతి పట్ల నివాళి

భీమునిపట్నం, ఆగస్టు 21 : వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు, యాదవ సంఘం నాయకుడు కోడిబోయిన రమణ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం కాపులుప్పాడ పంచాయతీలోని గొల్లలపాలెం. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నాయకులు ముత్తంశెట్టి మహేష్, మేరుగు చిన్నారావు, గుండాసు మధునాయుడు తదితరులు నివాళి అర్పించారు.